చెరువులను తలపిస్తున్న రోడ్లు..!



రేగిడి: కొమెర గ్రామానికి వెళ్లే రోడ్డులో గుంతలు



సంతకవిటి: ఎం.ఆర్.అగ్రహారం వద్ద గోతిలో నిలిచిన వర్షం నీరు



రామభద్రపురం: రామభద్రపురం నుంచి రాజాం వెళ్లే రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు



సంతకవిటి: పుల్లిట- తాలాడ గ్రామాల మధ్య రోడ్డుపై గుంతలో నిలిచిన నీరు



సంతకవిటి: తాలాడ వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు



సంతకవిటి: బురదమయమైన పోతులజగ్గుపేట వద్ద మూడురోడ్ల కూడలి



సంతకవిటి: సంతకవిటిలో విశాఖ డెయిరీ వద్ద ఇలా..



సంతకవిటి: పుల్లిట గ్రామ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గోతుల్లో వర్షం నీరు



సంతకవిటి: సంతకవిటి-పొందూరు రోడ్డులో రెల్లిగెడ్డపై ఉన్న కాజ్‌వే వద్ద ఇలా..



తెర్లాం: మండల కేంద్రంలోని రామమందిరం వద్ద గోతుల్లో నుంచి వెళుతున్న ఆటోలు



బాడంగి: మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో గోతుల్లో చేరిన వర్షపు నీరు

చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రాజాం, బొబ్బిలి నియోజకవర్గాల్లోని పలుగ్రామాల రోడ్లు చెరువుల్లా మారిపోతున్నాయి. రోడ్లు ఎక్కడికక్కడే గోతులు తేలి అధ్వానంగా ఉన్నాయి. తాజాగా కురిసిన వర్షాలకు ఈగోతుల్లో నీరునిలిచిపోవడంతో రోడ్లపై ప్రయాణిస్తున్నామా లేక చెరువుల్లో ప్రయాణిస్తు న్నామా అన్న అయోమయస్థితిలో ప్రయాణికులు వాహన చోదకు లు ఉన్నారు. గోతుల్లో నీరు చేరడం వల్ల అవి మరింత పెద్దగోతులుగా మారుతున్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు అదుపు తప్పి గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. సంతకవిటి మండలంలో రాజాం- సంతకవిటి ప్రధాన రహదారిలో తాలాడ,గరికిపాడు గ్రామాల వద్ద, సంతకవిటి విశాఖ డెయిరీ వద్ద, తాలాడ-మామిడిపల్లి రహదారి లో పుల్లిట వద్ద, పుల్లిట మామిడపల్లి గ్రామాల మధ్య, కె.ఆర్.పురం- ఎం.ఆర్ అగ్రహారం గ్రామాల మధ్య రోడ్లు ఛిద్రమ య్యాయి. ఈ మార్గాల్లో ప్రయాణించేందుకు వాహన చోదకులు, ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.రేగిడి మండలంలోని కొమెర, వెంకటాపురం, ఖండ్యాం, వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, తాటిపాడు, లచ్చన్నవలస తదితర గ్రామాల రోడ్లదీ అదే దుస్థితి. రామభద్రపురం మండలంలోని రామభద్రపురం-రాజాం వెళ్లే రహదారి గజానికో గొయ్యితో అధ్వానంగా మారింది. ఒక్కో గుంత అడుగు లోతుతో ఉండడం, ఆ గుంతలో వర్షపు నీరు చేరడం వల్ల వాహన చోదకులు వాటిని అంచనా వేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు.ఈ రోడ్డుపై ప్రయాణం నరక ప్రాయంగా ఉందని ప్రయాణికులు,వాహనచోదకులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

ఉద్యోగభద్రత కల్పించాలి



వైద్యాధికారి కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

రాజాం సిటీ: ఆశ వర్కర్లకు వేతనాల పెంపుతోపాటు ఉద్యోగభద్రత కల్పించాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యద ర్శులు సూర్యమణి, పార్వతి కోరారు. తమ సమస్యలు పరిష్క రించాలని కోరుతూ స్థానిక ఆదర్శనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ పనిభారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 9వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని చెప్పారు.ఆశ వర్కర్లు రమణమ్మ, చిన్నమ్మడు, రాణి, గౌరమ్మ, జయలక్ష్మి, తులసీరత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ చేపడుతున్న ఏపీడీ రమామణి

బొబ్బిలిరూరల్: దిబ్బగుడ్డివలస గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పి.శ్రీదేవిపై ఆశాఖ అధికారులు గురువారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ విచారణ జరిపారు.గతంలో పనిచేసిన శ్రీదేవిని వేతనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తోందన్న ఆరోపణలతో 2023లో సస్పెండ్ చేశారు.కాగా ఇటీవల ఆమె జిల్లా కలెక్టర్‌ను కలిసి తన కుటుంబ ఆర్థిక పరిస్థితులను వివరించగా..మరోమారు బహిరం గ విచారణ చేయాలని ఉపాధి హామీ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ మేరకు గజపతినగరం ఏపీడీ రమామణి వేతనదారుల సమక్షంలో విచారణ చేశారు.వేతనదారుల అభిప్రాయాలను సేకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఏపీడీ పేర్కొన్నారు. ఏపీఓ లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.

సాగు పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారు..?



మాట్లాడుతున్న వేమిరెడ్డి లక్ష్మునాయుడు

బొబ్బిలి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి నారు పోతలతో పాటు మెట్ట భూముల్లో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయని, రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సాగు పెట్టుబడి సాయం ఎప్పుడిస్తుందో చెప్పాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ప్రశ్నించా రు. పట్టణంలోని రైతు సంక్షేమ సంఘ కార్యాలయంలో గురవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతేడాది పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన చంద్రబాబు అండ్-కో ఈ ఏడాది కూడా ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఓవైపు పంటల బీమా ప్రీమి యం రైతులే కట్టుకోవాలని ఉచిత సలహా పడేసి అదనపు భారం మోపారని, ఇక ఇన్‌పుట్ సబ్సిడీ ఊసే లేదన్నారు. విత్తనాలు,ఎరువులు కొనుగోలు చేసుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నా కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకపోవడం బాధాకరమన్నారు. ఇంతగా రైతులను ఇబ్బందులు పెడుతున్న ఈ ప్రభుత్వం మంచి ప్రభుత్వమని ఓసారి, సుపరిపాలనకు తొలి అడుగు అని మరోసారి వారికి వారే ప్రకటించుకుంటుంటే ప్రజలు, రైతుల కడుపు మండు తోందన్నారు. వెంటనే అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తామన్న సాగు పెట్టుబడి సహాయాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: పట్టణ పరిధి కొండంపేట గ్రామానికి చెందిన ధర్మవరపు వెంకటరమణ అదృశ్యంపై కేసు నమోదుచేశామని సీఐ కె.అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు..వెంకటరమణ రాజాంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే ఆయన ఈనెల 2వ తేదీన విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఆయన భార్య మీనాకుమారి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: స్థానిక హరిజన ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను ఎంఈఓ త్రినాథరావు గురువారం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచి, శుచికరమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. రికార్డులను పరిశీలించడంతో పాటు విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని ఉపాధ్యాయినికి దిశా నిర్దేశం చేశారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, తదితరులు

బొబ్బిలి: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభు త్వం ఏడాది పాలనలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్‌చార్జీలు పెంచబో మని చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారాల్లో పదేపదే చెప్పారని, అలాగే ఎక్కడైనా స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తే అడ్డుకోవాలని, అవసరమైతే వాటిని పగలగొట్టాలని ప్రజలు, రైతులకు పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.తాము అధికారంలోకి రాగానే సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దుచేస్తామని అప్పట్లో చంద్రబాబు మాటిచ్చిన సంగతి ప్రజలకింకా గుర్తుంద న్నారు. విద్యుత్ ఒప్పందాల వల్ల ప్రజలపై భారం పడుతుందని లెక్కగట్టి చెప్పిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు వాటిని అమలు చేయడంలోమాత్రం ముందుంటున్నారన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా, ప్రజలపై భారాలను వ్యతిరేకిస్తూ ఈనెల 5న సీపీఐ రాష్ట్ర సమి తి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామని, ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి గొల్లపల్లి తౌడు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



రాజాం సిటీ: ర్యాలీ చేస్తున్న జీఎంఆర్ ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ఎల్.వి.ఆర్. ఎస్.వి.ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా పట్టణం లో కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణా నికి ముప్పు వాటిల్లుతోందన్నారు. ఈ ప్లాస్టిక్ కేవలం మాన వులకే కాకుండా ఇతర జీవజాలానికి హానికరమేనని అన్నారు. మనం చేసేతప్పులు భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని, విద్యార్థులంతా వారి కుటుంబం తోపాటు పరిసర ప్రాంతాల వారికి ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించాలని పిలుపు నిచ్చారు. పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయు డు, పెంకి చైతన్యకుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ కె.వి.ఎస్.ప్రసాదరావు, కళాశాల డీన్‌లు డాక్టర్ డి.రాంబాబు,డాక్టర్ ఎం.వి.నాగేశ్వరరావు, డాక్టర్ కె.రవీంద్రనాథ్, పాల్గొన్నారు.

మానవ మనుగడకే ముప్పు..



రామభద్రపురం: ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జె.సి.రాజు

రామభద్రపురం: ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు జె.సి.రాజు అన్నారు.అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల కు గురువారం అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ బాటిళ్ల,సంచుల వినియోగానికి ఎంత దూరంగా ఉంటే పర్యావరణానికి, ఆరోగ్యానికి అంత మంచిదని చెప్పారు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రాజాం సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయం వద్ద మోకాళ్లపై కూర్చొని గురువారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనిల్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని 58 రోజులుగా కార్మికులు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నా, గత నెల 22వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులు సమ్మెను విరమించి విధుల్లోకి రాకుంటే ఉద్యోగాలు తొలగిస్తామని అధికారులతో నోటీసులు ఇప్పించి బెదిరింపులకు పాల్పడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమ్మెతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షులు, నాయకులు రామ్మూర్తినాయుడు, మరియదాసు, శారద, నర్సింగరావు, కృష్ణ, భాస్కరరావు, చిరంజీవి, రాజు, లక్ష్మి, ప్రసన్న,తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్లకు దరఖాస్తులాహ్వానం

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న ఎస్సీ, ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులాహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీ ఉన్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు నేరుగా పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

నవధాన్యాలతో నేల సారవంతం



నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

రేగిడి: నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ ఆర్‌టీఎల్ హేమసుందర్ అన్నారు. మండలంలోని గుళ్లపాడు గ్రామంలో నవధాన్యాల సాగును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలను సాగు చేయడం వల్ల భూమిలో జీవవైవిధ్యం పెరుగుతుందని, ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే ప్రధాన పంటలకు పోషకాలు సమృద్ధిగా లభిస్తాయన్నారు. నవధాన్యాలను చల్లిన 45 రోజుల తర్వాత చేనును భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. డీఎల్ఎంటీ స్వామినాయుడు, ఎస్ఎఫ్ఎంటీ డి.పద్మ, ఐసీఆర్‌పీ రవి, ఎల్-2 పి.గౌరీశ్వరరావు, పి.సురేష్ పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి



వంగర: బాగెంపేటలో క్లోరినేషన్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

వంగర: మండలంలోని అన్ని గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని ఎంపీడీఓ ఎస్. రఘునాథాచారి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని శ్రీహరిపురం, బాగెంపేట, మగ్గూరు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. వీధికాలువలు, తాగునీటి వనరులను, పారిశుద్ధ్యపనులను పరిశీలించారు. కాలువల్లో పూడి క, చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించా రు. గ్రామాల్లో ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని గ్రీన్‌అంబాసిడర్లకు దిశానిర్దేశం చేశారు.ఆయా గ్రామాల సచివాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ కెల్ల రామారావు, పంచాయతీ కార్యదర్శి ఇందిర, తదితరు లున్నారు.

చెత్త సేకరణ పరిశీలన

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామంలో ఇళ్ల నుంచి గ్రీన్ అంబాసిడర్ చేపడుతున్న చెత్తసేకరణ పనులను పంచాయతీ కార్యదర్శి సవలాపురపు రామారావు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామ మహిళలకు పంచాయతీ కార్యదర్శి పలు సూచనలు చేశారు. చెత్తను ఆరుబయట పారబోయవద్దని, ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు త డి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్



బొబ్బిలిలోని ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ శ్యామసుందరరావు

బొబ్బిలి: రైతులు ప్రస్తుతానికి అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను తీసుకువెళ్లాలని,అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని వ్యవసాయ శాఖ ఏడీ ఇన్‌చార్జి ఎం.శ్యామసుందరరావు హితవు పలికారు. 'అన్నదాతకు ఎరువు కష్టాలు' శీర్షికతో సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. ఈమేరకు పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేశారు.ఎరువులు ఎంత మేర నిల్వలున్నాయి, రైతులకు ఎంత మేర అవసరమన్న విషయాలను ఆరా తీశారు. ఆయా దుకాణాల్లోని రికార్డులను పరిశీలించి, ఎరువుల దుకాణాల యజమానులకు పలుసూచనలుచేశారు. రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 10వ తేదీ తర్వాత యూరియా అందజేస్తామని తెలిపారు. ఎక్కడా ఎరువుల కొరత లేదన్నారు.

రైతుల నడ్డివిరుస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, సురేష్‌కుమార్, తదితరులు

రేగిడి: నీటి తీరువా వసూళ్లతో కూటమి ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోందని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, పోలినాటి వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కింజరాపు సురేష్ మండిపడ్డారు.మండలంలోని అంబకండి గ్రామంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నీటి తీరువా వసూళ్లకు సంబంధించి పాతబకాయిలను ఆరుశాతం వడ్డీతో రైతుల నుంచి వసూలు చేస్తోంద న్నారు.రాష్ట్ర ప్రభుత్వం 1430, 1431, 1432, 1433, 1434 ఫసలీలకు నీటి తీరువా వసూళ్లకు సంబంధించి రైతులకు ఇస్తున్న డిమాండ్ నోటీసుల్లో పాత బకాయిలను ఆరు శాతం వడ్డీతో చెల్లించాలని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారన్నారు. అంతే కాకుండా ప్రతీ రైతు వద్ద సర్వీసు ట్యాక్స్ పేరిట రూ. 35 వసూలు చేస్తూ అదనపు బారం మోపుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈవిధంగా రైతులను దోపిడీ చేసి సంపద సృష్టిస్తున్నారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు నీటి తీరువా విషయంలో రైతులను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇబ్బంది పెట్టలేదని గుర్తు చేశారు. రైతు భరోసా పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి ఠంచన్‌గా సాగు పెట్టుబడి సాయం అందించే వారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఒక ఏడాది పెట్టుబడి సాయం ఎగ్గొట్టిందని అన్నారు. నీటి తీరువా చెల్లిస్తేనే అన్నదాత సుఖీభవ పథకం కింద సాగుపెట్టుబడి సాయం నిధులు బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని అధికారులు చెబుతుండడం విడ్డూరంగా ఉందని అన్నారు. నీటి తీరువా నిర్బంధ వసూళ్లను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. రేగిడి, సంకిలి పీఏసీఎస్‌ల మాజీ చైర్మన్‌లు నెల్లి పెంటన్నాయుడు, లావేటి వెంకట వేణుగోపాల నాయుడు, రేగిడి మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు కెంబూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యత పరీక్షలు తప్పనిసరి



రాజాం: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు, తప్పనిసరిగా ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలు చేపట్టాలని ఎంపీడీఓ పి.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లీశ్వరరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలని, బోర్ల చుట్టూ చెత్త, మురుగు నీరునిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో రోజూ ఉదయం గ్రీన్ అంబాసిడర్లు చేపట్టే చెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అలాగే మండలంలోని నారాయణప్పవలస పంచాయతీ పరిధిలో గ్రీన్ అంబాసిడర్లు చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ రవికుమార్, డిప్యూటీ ఎంపీడీఓ భాస్కరరావు పరిశీలించారు.




బొబ్బిలిరూరల్: నారాయణప్పవలసలో చెత్తసేకరణను పరిశీలిస్తున్న అధికారులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రాజాం: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవా లని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులను ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని చెప్పారు. ఇంటింట ఫీవర్ సర్వే చేయాలని, జ్వరపీడితులున్న గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని దిశా నిర్దేశం చేశారు. పాగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి గట్టి బార్గవి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగన్‌మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌ల దినోత్సవం



మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం: పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో టూ వీలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ బైక్ మెకానిక్‌ల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. బైక్ మెకానిక్‌లు ఏర్పాటు చేసిన సమావేశానికి అతిథిగా పట్టణ సీఐ అశోక్ కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బైక్ మెకానిక్‌లది కీలక పాత్ర అని అన్నారు. బైక్ మెకానిక్‌లు బాధ్యతగా వ్యవహరించాలని, నిబంధనల ప్రకారం కాలంచెల్లిన వాహనాలు వినియోగించవద్దని, వాటి వల్ల కలిగే అనర్థాలను వాహనచోదకులకు వివరించాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు తీసుకొచ్చే బైక్‌లపై దృష్టిసారించాలన్నారు. అనంతరం సీఐని బైక్ మెకానిక్‌లు సత్కరించారు. అంతకుముందు రాజాం పట్టణంలో రాజాం టౌన్, మండలం, రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం, తెర్లాం తదితర ప్రాంతాలకు చెందిన వందలాదిమంది బైక్‌మెకానిక్‌లు ర్యాలీ చేశారు.